● సతీష్ చందర్
● చిత్రాలు: నర్సిం

నా చావుకు నేనే ముహూర్తం నిర్ణయించుకున్నాను. అది ఈరోజే.

మిట్టమధ్యాహ్నం పన్నెండు గంటలు.

మండుటెండలో గడ్డపార నిలువునా దిగవేస్తే, దాని నీడ తగ్గుతూ, తగ్గుతూ వచ్చి మాయమవుతుంది. సరిగ్గా అప్పుడే సూర్యుడు నడినెత్తికొస్తాడు.

అదే ముహూర్తానికి నా కథ సుఖాంతంగా ముగుస్తుంది. ముగింపు విషాదం కాదు. ప్రయాణం సగంలో ఆగిపోవడమే అసలు నరకం.

నాకిప్పుడు మరణమంటే లోయలోకి దూకటం కాదు, పర్వతాన్ని అధిరోహించటం.

* * *

రాజు మరణించి నేటికి మూడవరోజు. రాజు నా కుక్క పేరు. గమ్మత్తు చూశారా! నా పేరు కూడా రాజే.

నా పేరే కుక్కకు కూడా పెట్టింది అమ్మ. నామీద కోపంతో కాదు, నా కుక్క మీద ప్రేమతో.

రాజు మేలుజాతి జాగిలం కాదు. కనీసం ఊరకుక్క కూడా కాదు. ఊరు వెలుపలి కుక్క. కడజాతి కుక్క

రాత్రికి రంగు లేనట్టు, నా రాజుకి కూడా రంగు లేదు. లోకం దృష్టిలో అదొక డర్టీ బ్లాక్ డాగ్! నాకూ, నా తల్లికీ నల్లబంగారం.

నిన్న కాక మొన్న, రాజు పట్టపగలు చనిపోయింది. అదికూడా పన్నెండు గంటలకే. చక్రవర్తులకు కూడా ఆ చావు రాదు. విజయాన్నీ, వీరస్వర్గాన్నీ ఒకేసారి పొందగలిగింది నా రాజు.

రాజు అంతిమయాత్రను ఘనంగా చేయించాను. టాపులేని జీపులో, పేట పేటంతా ఊరేగించాను. నా మిత్రులందరూ తెల్లని దుస్తుల్లో సైనికుల్లా నడిచారు. అంతటా నిశ్శబ్దం!

నిశ్శబ్దం ఎప్పుడూ విషాద సూచిక కాదు. పంట కాలువ ప్రవాహం నిశ్శబ్దం. మదర్ థెరెసా చిరునవ్వు నిశ్శబ్దం. అంతెందుకు, పల్లెల్లో తెల్లవారటం కూడా నిశ్శబ్దమే.

రాజు శవపేటికను సమాధిలో ఉంచేటప్పుడు మాత్రం నిశ్శబ్దాన్ని భంగపరచాను. నాన్న పిస్తోలు తీసి మూడుసార్లు గాలిలోకి పేల్చాను. ఎందుకలా చేశానో నాకే తెలియదు. ఆరోజు నేను స్వేచ్ఛను కొత్తగా అనుభవించాను. ఎన్నో ఏళ్ళు బందీగా ఉన్న ఖైదీకి సంకెళ్ళు తెగిపోతే ఇలాగే ప్రవర్తిస్తాడన్న హామీ లేదు. అతడు ఏమైనా చెయ్యవచ్చు. లేడిలా పరుగెత్తవచ్చు. లేదా బోరున ఏడ్వనూవచ్చు.

నేను కాల్పులు జరిపాను. బహుశా తుపాకీ ఏడ్చినప్పుడు తూటాలే కన్నీళ్ళు కావచ్చు. నేను గర్వంగా ఏడ్చాను కదా! కన్నీళ్ళు నేలమీద పడకుండా నింగికి ఎగరటమే ధర్మం.

నల్లని రాజుకు తెల్లని సమాధి. దానిమీద రెండే రెండు పదాల 'ఎపిటాఫ్':

గాయమే హృదయం.

అవును. ఒక నిరాడంబర వాక్యం. 'ఐ లవ్యూ' అన్నంత సర్వసాధారణ వాక్యం. తొలిసారిగా అన్నవాళ్ళకి మాత్రమే అందులోని నొప్పి తెలుస్తుంది.

నా జీవితానికి కూడా ఇదే వాక్యాన్ని 'మలి పలుకు'గా చెక్కించి పెట్టుకున్నాను.

* * *


అర ఎకరం పొలం పక్కనే చిన్న చెరువు. ఆ చెరువు గట్టుమీదనే నా రాజు సమాధి.

నా ప్రేమ వికసించిన చోటనే నా రాజుకి సమాధి.

నాదేవి... కాదు, కాదు. రాజరాజేశ్వరీ దేవిగారు నాకోసం భువినుంచి దివికి వచ్చింది ఇక్కడికే.

చెరువులోని కలువ మొగ్గల్ని చూసి, "ఏయ్! ఎన్ని మొగ్గలో" అంటూ నవ్వింది. కానీ, అప్పుడామె బుగ్గమీద పడింది ఒకే ఒక గుంట. అదే లోయ.

నా జీవిత వేదిక మీదికి నేను తొలిసారిగా



ఆహ్వానించిన ముఖ్య అతిథి రాజరాజేశ్వరీ దేవి. ఆరోజు ఆమె నాతో ఉన్నది అర్ధగంట మాత్రమే. కానీ, ఆమె అప్పుడేమేమి చేసిందో, ప్రతిక్షణాన్ని ఒక అధ్యాయంగా మలిచి ఒక మహాగ్రంథాన్ని రచించగలను.

ఆమె మోసుకొచ్చిన సాయంకాలపు వెండి ఎండనుంచి, ఆమెగారికి పూసి వెళ్ళిన సన్నజాజి పరిమళం వరకూ అన్నీ తాజాగా నా వద్దనే ఉన్నాయి.

నా హృదయేశ్వరి నాదగ్గరకొచ్చిన రోజున నా మిత్రులెవ్వరూ దగ్గర లేరు. నేనే రాకూడదన్నాను. నేను కాకుండా ఈ అపూర్వ సన్నివేశంలోకి



ఇద్దరే ఇద్దరు ప్రవేశించారు. ఒకరు: నా తల్లి. మరొకరు: నా రాజు. నా తల్లి స్వాగతం పలికితే, నా రాజు తోడ్కొని వచ్చాడు.

నన్ను చల్లగా చూసేవాళ్ళెవరైనా నా తల్లికి ఆప్త బంధువులే. దేవి గురించి కూడా అలాగే చెప్పాను.

"నా బిడ్డ చెప్పాడు తల్లీ. నీ మనసు వెన్నపూస లేమ్మా!"

దేవి నుదుటి మీద పోసిన చిరు చెమట్లను తన మెత్తటి చెంగుతో తుడిచి ఆహ్వానం పలికింది. ఈ భూప్రపంచంలోనే అంతకు మించిన ఘనస్వాగతాన్ని నేను ఊహించలేను.

అప్పటికే నా రాజు చెవులు రిక్కించి, ముందు కాళ్ళు పైకెత్తి నా దేవికి అభివాదం చేసి ఆమె చుట్టూ తిరిగింది. దేవి పాదాలను వాసన చూసింది.

ప్రపంచాన్ని అర్థం చేసుకోవటంలో నాకూ, నా తల్లికీ, నా రాజుకీ- ఎవరి పద్ధతులు వారికున్నాయి. నేను చూసి నమ్ముతాను. అమ్మ చూడక నమ్ముతుంది. రాజు వాసన చూసి నమ్ముతుంది.

నా రాజు కూడా నమ్మి తోకాడించింది.

"ఒరేయ్ రాజూ! బడాయి చాలుగాని, అమ్మాయిని చెరువు గట్టుకి తీసుకెళ్ళు. నా బిడ్డ చూస్తుంటాడు." నా తల్లి నా రాజుని ఆదేశించింది.

పొలం గట్టును పావుగంట సేపు జాతీయం చేసింది నా రాజు.

ఎవరూ దేవికి ఎదురు రావటానికి వీల్లేదు. పక్కన నడవటానికి వీల్లేదు. రాజు పైలెట్‌లా ముందు పరుగెత్తింది. నడిచేటప్పుడు ఆమె పాదాలకు అడ్డు పడకుండా, చిన్న కాగితం ముక్క కూడా లేకుండా నోటితో, కాళ్ళతో శుభ్రపరిచింది నా రాజు.

మంచుతో చీర నేస్తారా? ఎవరో అంతపనీ చేశారు. ఆ చీరతోనే వచ్చింది నా సాయంకాలపు సుందరి రాజ రాజేశ్వరీ దేవి.

ఆమె నన్ను చేరటానికి ఇంకా ఆమడ దూరం ఉండనగానే నా రాజు కుక్కలా, కాదు లేడిపిల్లలా గెంతింది. నావైపూ, ఆమెవైపూ మార్చి మార్చి క్రికెట్ పరుగులు తీసింది. నా దేవి రాకతో నా ముఖంలో వచ్చిన స్వచ్ఛమైన వెలుగును గుర్తించి నాట్య మాడింది, మూలిగింది.

దాని భాష నాకు తెలుసు. దానిదొకరకమైన మార్మిక కవిత్వం. నా కళ్ళు చెమర్చాయి. దాని రెండు చెవుల మధ్యా నిమిరాను. అంతే, మరుక్షణం అక్కడ ఉంటే ఒట్టు. ఒక్కటే పరుగు. ఎందుకో తెలుసా? వెంటనే అందించాలి. వార్త! గొప్ప వార్త. మనిషి ప్రకాశించటం నా రాజుకి గొప్ప వార్త.

ఆప్యాయత విరజిమ్మినప్పుడే మనిషి ప్రకాశిస్తాడు. అనుమానం లేదు. నా దేవినీ చూసిన వెంటనే నేను ఎంతో కొంత ప్రకాశించే ఉంటాను. ఆ విషయాన్ని నా తల్లితో చెప్పాలి. అందుకే దాని స్పీడు.

ఆ పూట రాజేశ్వరీ దేవి నా తల్లిని పొగడింది. నా రాజును కీర్తించింది. మరి నన్నూ? తెలియదు. అడగాలనుకున్నాను.

చిరుగాలినీ, చిన్నదాని ప్రశంసనీ అడిగి తీసుకో కూడదు. హాయి మిగలదు. అందుకే ఆమెవైపే చూశాను. బుగ్గమీది లోయ చెక్కు చెదరకుండా ఉంది. అంటే, ఆమె ఇంకా నవ్వుతూనే ఉన్నట్టు లెక్క.

ముంచుకొచ్చిన సిగ్గు ఆమె చూపును కలువ మొగ్గల వైపు మళ్ళించింది.

"బాగున్నాయి" అని కిసుక్కుమంది.

"అంటే ఎలా ఉన్నాయి? జోడించిన చేతుల్లా లేవూ! అన్ని అభివాదాలూ దేవిగారికే" అన్నాను. ఈసారి గలగలా నవ్వింది.

"ఒక మొగ్గ కోసి తేనా?" దిగబోయాను.

"దిగకండి. మురికినీళ్ళు." వారించటానికి నన్ను చెయ్యి పట్టుకుని తనవైపు లాక్కుంది.

తన ప్రశంసను నా పెదవుల మీద, తన పెదవులతో లిఖితపూర్వకంగా రాసి ఇచ్చింది.

తొలి ముద్దూ, మలి పొద్దూ ఒకేసారి విడిచాయి.

**చెరువులోని కలువ మొగ్గల్ని చూసి "ఏమిటి ఎన్ని మొగ్గలో! అంటూ నవ్వింది. అప్పుడామె బుగ్గమీద పడింది ఒకే ఒక గుంట. అదే లోయ.**

దూరంగా నా రాజు మా ఇద్దరి కోసం ఎదురు చూస్తున్నది. ఆ రోజు దేవినీ, వెలుతురునీ ఒకేసారి సాగనంపాను.

అభం శుభం తెలీని అమ్మ నాకు బువ్వ మాత్రమే పెట్టి నిద్రపోయింది. ఆ పిల్ల ఎందుకొచ్చిందని ఒక్క ముక్కా అడగలేదు.

* * *

నా దేవి వచ్చివెళ్ళాక నాకు రాత్రి పగలయింది, పగలు రాత్రయింది. వరండాలో మడత మంచం మీద నడుం వాలిస్తే స్వర్గం దిగి వచ్చేది. మంచం కింద ముడుచుకుని నా రాజు.

స్వప్నాలు. అందమైన స్వప్నాలు. నాకు ఇష్టం వచ్చిన స్వప్నాలు. నా అధీనంలో ఉండే స్వప్నాలు. తెరచిన కళ్ళకు అలాంటి స్వప్నాలే వస్తాయి.

నాకు మౌనం ఎంత ఇష్టమో, నా రాజుకు మొరగటం అంత ఇష్టం. ఆకు కదిలితే చాలు, అదే పెద్ద వంక. ఆరా తీస్తున్నట్టు మొరుగుతుంది. పొరపాటున వేరే కుక్క ఎక్కడయినా మొరిగినట్టు అనిపించిందో రాజును పట్టుకోలేం. పరమ వీరోచితంగా మొరుగుతుంది.

అమ్మ మధ్య మధ్యలో లేచి, "ఏమయ్యిందిరా దానికి? నోరు ముయ్యమను" అని కేకలు పెట్టేది.

అమ్మ మాటకు అది కుయ్ కుయ్‌మని గారాలు పోతూ, అమ్మ అలికిన అరుగును గోళ్ళతో గీస్తుండేది.

ఏ మాట కామాటే చెప్పాలి. రాత్రిపూట కుక్కలదే ప్రభుత్వం. అవి రాత్రి సింహాలు. కొందరు వాటిని 'గ్రామ సింహాలు' అంటారు. నా రాజు 'వాడసింహం', తన శునక సామ్రాజ్యంలోకి ఒక్క ఊరకుక్క ప్రవేశించినా అది నిలదీస్తుంది.

తెల్లవారకనే నేను నిద్రలోకి జారుకునేవాడిని. నా స్వప్నం కరిగిపోయేది.

కాలేజీకి సెలవులు ఇచ్చారు కదా! మరో పదిహేను రోజులవరకూ తెరవరు. ఈలోపుగా దేవీ దర్శనం ఉండదు.

ఉత్తరం రాస్తానన్నది. నిజానికి మా ఊరికీ, వాళ్ళ ఊరికీ పది కిలోమీటర్లే దూరం. అయినా వెళ్ళాలని లేదు. నా దేవి నన్ను వెతు క్కుంటూ రావాలన్నదే నా జీవితేచ్ఛ. ఆ కోరిక కాస్తా తీరిపోయింది. ఆమెను ఆరాధించటం తప్ప నాకిప్పుడు వేరే పనిలేదు.

అయినా, ఆమె నుంచి ఒక వరం; ఒక ఉత్తరం! ఆమె చేతివ్రాత! నాకోసం పెదిమలు అదిమిపెట్టుకుని అల్లిన అక్షరమాల! అందులోని ప్రతి అక్షరం లోనూ రెండు పెదవుల అమరికను సుస్పష్టంగా చూడగలను. నాకు ఒక గట్టి అనుమానం కూడా కలుగుతోంది. అసలు తెలుగు లిపే తెలుగు అమ్మాయిల లిప్స్‌లోంచి పుట్టి ఉండాలి. లేకుంటే అక్షరం అంత గుండ్రంగా ఎలా ఉంటుంది?

అందుకేనేమో, నా దేవి పెదవి ముద్రల కోసం అంత నిరీక్షణ. నా ఎదురుచూపు నా రాజుకి తెలుసు. పోస్ట్‌మాన్ సైకిల్ బెల్లు వినపడితే చాలు మీదకి దూకేది. పోస్ట్‌మాన్ దండం పెట్టేసేవాడు. నా ప్రేమ అతడి ప్రాణం మీదికి వచ్చింది. ఎప్పటిలాగే పోస్ట్‌మాన్ మా ఇంటి దగ్గర ఆగకుండా వెళ్తుంటే, ఒకరోజు నా రాజు అతని ప్యాంటు పట్టుకుంది. కింద పడ్డాడు. ఉత్తరాలన్నీ చెల్లా చెదురయ్యాయి. అతని మోచేతులు చీరుకుపోయి నెత్తురు వచ్చింది. నేను పరుగున వెళ్ళాను. కానీ, అతన్ని లేవదీయలేదు. కిందపడ్డ ఉత్తరాలను హడావిడిగా వెతికాను. ఎక్కడా చిరునామా లేదు. అప్పటికి వారం గడిచింది.

ఒకరోజు నేనే మోపెడ్ తీసుకుని బయలుదేరాను. మోపెడ్‌కన్నా ముందుగా నా రాజు. చేరాల్సిన గ్రామం చేరాం.

ఊరు మధ్యలో ఊడలు వేసిన మర్రిచెట్టు. చెట్టు చుట్టూరా సిమెంటు అరుగు. అరుగు మీద వృద్ధుడు. నెరసిన మీసాలు కూడా మెలి తిప్పి ఉన్నాయి. ఖద్దరు పెంచె, ఖద్దరు బనీను. బొనంపట్టు వేసుకుని కూర్చున్నాడు. మందపాటి కళ్ళజోడులోంచి పేపరు చదువుతున్నాడు.


ఫలానా సుబ్బరాజు గారి ఇల్లు ఎక్కడా అని అడి గాను. ఎదురుగా ప్రహరీ గోడ ఉన్న డాబా చూపిం చాడు. గేటు తెరిచే ఉంది. అటువైపే ఆత్రంగా చూశాను.


నా దేవి గుమ్మం ముందు ముగ్గులు పెడుతోంది. తొలుత ఆమె మెత్తని పాదాలు చూశాను. మనసు కుదుటపడింది.

నా రాజు చూసిందే తడవుగా దూసుకుంటూ వెళ్ళి ఆమె చుట్టూ తిరిగింది. కంగారుపడి కొట్టబోయింది.

"దేవీ." అరిచాను.

వెనక్కు తిరిగింది. ఆమె ముఖంలో హరివిల్లు విరియలేదు. పెదవులమీద ఏ భావమూ లేని నరళ





రేఖ కనిపించింది. నా గుండె జారిపోయింది. అటే చూస్తూ ఉండిపోయాను. ఆమె లోనికి వెళ్ళిపోయింది.

ఒక నిరాదరణ, ఒక నిర్లక్ష్యం, ఒక తిరస్కారం!

కళ్ళు గట్టిగా మూసుకున్నాను. తెరిస్తే నా చెక్కిళ్ళు తడిసిపోతాయి.

"ఏ ఊరబ్బాయ్ నీది?"

చెట్టుకింద ముసలి కంఠం గంభీరంగా ప్రశ్నించింది.

"గుమ్మలూరు" అన్నాను, నా కళ్ళ నీళ్ళు అదిమి పెట్టుకుంటూ.

"ఎవరి అబ్బాయివు?"

"జాన్ రత్నంగారి అబ్బాయిని."

"ఏం చేస్తాడు మీ నాన్న?"

"కువైట్‌లో ఉన్నాడు."

"మీరు పంచములా?"

ఆ ప్రశ్న నన్ను బాధపెట్టలేదు. అలవాటయినదే. కానీ, అతడు నన్ను చూసిన చూపు తలయెత్తనివ్వలేదు. అంత నీచంగా ఉంది. అయినా సరే, అవునన్నట్లు తల ఊపాను.

ఈలోపుగా కాళ్ళ దగ్గిర రాజు అలికిడి. దాని నోటిలో ఒక కాగితం ముక్క. ఉత్తరం! నా దేవి నాకోసం పంపిన 'శునక సందేశం'. అనుమానంతో, కేవలం దింపుడు కళ్ళం ఆశతో ఉత్తరం తెరిచాను.

రాజుగారూ,

మీకూ, నాకూ చాలా దూరం. ఈ విషయం ఎందుకు దాచారు? మీ ఇంటికొచ్చి చూసేవరకూ నేను తెలుసుకోలేకపోయాను. ఏదో కులమన్నా సరిపెట్టుకునేవాళ్ళం. మరీ ఆ కులమా?

వద్దు. ఇక్కడితో ఆపండి.

-దేవి

అక్షరాల్లో పెదవులు కాదు. లుంగలు చుట్టుకున్న పాములు కనిపించాయి. ఆ ఉత్తరం అక్కడే వదిలేశాను. దాచాలన్న ఆసక్తీ, చించాలన్న చికాకూ రెండూ కలుగలేదు. నిర్లిప్తత. నిర్లిప్తతలోనే మోపెడ్ స్టార్ట్ చేసుకుని వెనుదిరిగాను.

నా బండి నన్ను నడిపింది. శివుడి కంఠంలో గరళంలా దుఃఖం పీక దగ్గరే గడ్డ కట్టింది. ఇంటికొచ్చిపడ్డాను.

"నాయనా! వచ్చావా? కాళ్ళు కడుక్కో, అన్నం పెడతాను" అంటూ గబగబా అన్నం వడ్డించింది. అన్నం గిన్నెవైపు కాకుండా, ఆమె అరచేతులవైపు చూశాను. ఆ చేతుల్లోనే ముఖం పెట్టుకుని బావురుమంటూ ఏడ్చాను.

"ఏమయ్యిందిరా తండ్రీ! ఇంత కష్టం ఎవరు తెచ్చార్రా కన్నా" అని అమ్మ కూడా ఏడుస్తూనే తల్లడిల్లిపోయింది.

నేను ఏడ్చి ఏడ్చి తేరుకున్నాను. అప్పుడు మాత్రం ఆరా తీసింది అమ్మ.

"నాన్న గుర్తొచ్చాడు" అని తప్పించుకున్నాను.

అంతే. తన కొంగుకు కట్టుకున్న వంద రూపాయల నోట్లు నాలుగు తీసి, "నాయనకి ఫోన్ చెయ్యి. బెంగ తీరుద్ది" అని నా తల నిమిరింది అమ్మ.

నాకు ఊహ వచ్చాక అమ్మకు చెప్పిన తొలి అబద్ధమది.

నేను అన్నం తిని లేచి వెళ్ళిపోబోతుండగా, "నువ్వొక్కడివే వచ్చావ్? ఆ రాజు ఎక్కడ చచ్చింది" అని అడిగింది అమ్మ. అప్పటివరకూ నా రాజు నా స్ఫురణలోకే రాలేదు. వస్తుంది కదా అని ఎదురుచూశాను.

గంట... రెండు గంటలు... మూడు గంటలు గడిచినా రాజు రాలేదు. చీకటి పడిపోయింది. ఫలితం శూన్యం.

నేను మోపెడ్ తీసుకుని మళ్ళీ కోడేరు వరకూ వెళ్ళి వచ్చాను. చీకట్లో ఎక్కడా కనపడలేదు.

ఇప్పుడు నా కళ్ళముందు దేవి లేదు. నా రాజు రూపమే కదలాడుతోంది. ఏమయింది? రెండు రోజులు గడిచిపోయాయి. మూడవరోజు ఉదయం- నేనింకా నిద్ర లేవకుండానే- నా పక్కనే ఏదో దుర్వాసన. కళ్ళు మెల్లిగా తెరచి చూశాను.

కుక్క ఆకారం. నా రాజే. ఒంటినిండా గాయాలతో, ఒక కాలు విరిగి వేలాడుతూ, పరమ భయంకరంగా నా రాజు.

"అమ్మా! రాజు!" పెద్దగా అరిచాను. అమ్మ ఇంట్లో లేదు.

రాజు దగ్గరకు రాబోయింది. భరించలేని వాసన. దాని గాయాలలోంచి దుర్వాసన. కానీ, దీనంగా దాని కళ్ళు. ఈలోగా అమ్మ వచ్చింది. బాధపడి, ఆందోళన చెంది అన్నం తెచ్చింది. ఎప్పటిలాగే అరుగుమీద దాని గిన్నెలో అన్నం పెట్టింది. నేను ముక్కు మూసుకున్నాను. అది గమనించిన అమ్మ రాజు గిన్నెను దూరంగా వాకిలి బయట పెట్టింది. నా రాజు మెతుకు ముట్టలేదు. నావైపే చూస్తూ ఉండిపోయింది.

ఆ దృశ్యాన్ని భరించలేక మోపెడ్ తీసుకుని బయటకు వెళ్ళిపోయాను.

"మొన్న మీ రాజుని స్కూటర్ కొట్టేసింది కదా! బతికిందా?" స్కూలు నుంచి వచ్చే పేట కుర్రాడు అడిగాడు. నేను సమాధానం ఇవ్వకుండా వెళ్ళిపోయాను.

అలా అలా రోడ్లమీద తిరిగి వచ్చాను. మిట్ట మధ్యాహ్నం పన్నెండు గంటలయింది. బాగుచేసే పేరుమీద ఒకచోట రోడ్డు తవ్వుతున్నారు.

అక్కడ గడ్డపార నిలువునా దిగెయ్యటం నేను చూశాను. దాని నీడ దాని కిందే మాయమయ్యింది.

నా వెనుక నుంచి లారీ వస్తోంది. నేను పక్కగా డ్రైవ్ చేస్తున్నాను. ముందుకు చూసేసరికి ఎదురుగా నా రాజు. స్రవించే గాయాలతో నా రాజు. వేలాడే కాలుతో కుంటుకుంటూ వస్తున్న నా రాజు. లారీకి ఎదురుగా!

"రాజా" అని పిలిచాను. అది చూసింది. కానీ నడక మార్చలేదు.

ఘోరం జరిగిపోయింది. లారీ దానిమీద నుంచి వెళ్ళిపోయింది.

కడజాతి కుక్క మరణించింది. కావాలనే మృత్యువును ముద్దాడింది. తలయెత్తుకుని వెళ్ళిపోయింది. అభిమానంతో తెర దించుకుంది.

ఒక నిరాదరణ, ఒక నిర్లక్ష్యం, ఒక తిరస్కారం భరించలేక మరణించింది.

గాయం అంటరానిదయ్యిందా?

ఈ ప్రశ్న నన్ను తలకిందులు చేసింది. నేను తొడుక్కున్న తెల్ల చొక్కాను విప్పేశాను. ఆ చొక్కాలోకి నా రాజు మృతదేహాన్ని ఎత్తుకున్నాను.

నా ప్రేమ సకల దుర్గంధాలనూ జయించింది.

హృదయం! హృదయం అంటారు కానీ, దాన్ని తీసి బయట ప్రదర్శిస్తే పారిపోతారు. ప్రతి గాయం ఒక తెరచిన హృదయం.

నా దేవి కూడా నా గాయాన్ని చూసి ముక్కు మూసుకుంది. తల తిప్పుకుంది. నా కుక్కకు ఉన్న అభిమానం కూడా నాకు లేదా?

నా రాజు మరణించిన మూడవ రోజునే నేను కూడా తుదిశ్వాస పీల్చాలనుకున్నాను.

* * *

ఉదయమే లేచాను. తలస్నానం చేశాను. నా తల్లి తన చల్లని చేతుల్తో దీవించింది. పరీక్షకు వెళ్తున్నానని చెప్పాను. అబద్ధం కాదుకదా! 'నువ్వు గెలుస్తావురా కన్నా' అన్నది అమ్మ. నేను కోరినట్టుగానే నా స్నేహితుడు జీపు సిద్ధం చేశాడు. నాన్న పిస్తోలును రహస్యంగా జేబులో పెట్టుకున్నాను.

చిన్నప్పుడు నాన్న నేర్పించిన అన్ని విద్యలూ జీవితంలో అక్కరకు వచ్చాయి. గురి తప్పకుండా పిస్తోలు పేల్చటం కూడా నా జీవిత చరమాంకంలో ఉపయోగపడబోతోంది.

నా ప్రణాళికను సగమే నా స్నేహితుడికి చెప్పాను. లేకుంటే జీపు కాదుకదా, సైకిల్ సాయం కూడా చేసేవాడు కాదు.

కొత్త దుస్తుల్లో ఠీవిగా ఉన్నానని నా స్నేహితుడు ప్రశంసించాడు. జీపు బయలుదేరింది. నా స్నేహితుడే నడుపుతున్నాడు. నిజం చెబుతున్నాను. అదొక అద్భుత ప్రయాణం. నా మనసు గాలిలో తేలుతోంది.

జీపు ఊడల మర్రిచెట్టు పక్కనే ఆగింది. అదే మీసాల వృద్ధుడు. అదే కళ్ళజోడు. అదే సన్నివేశం. మన గ్రామాల్లో దృశ్యాలు అంత సులభంగా మారవు.

నేను దిగాను. మీసాల వృద్ధుడు నాలుగు కళ్ళతో చూశాడు. అందులో నాలుగు వర్ణాలూ కనిపించాయి.

నేను చాలా దర్జాగా, స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రధానమంత్రి ఎర్రకోట ఎక్కినంత రాజసంగా, రాజరాజేశ్వరీ దేవి ఇంటి గుమ్మం వైపు వెళ్ళాను. ఎవరూ లేరు.

> కుక్క ఆకారం. నా రాజే. ఒంటినిండా గాయాలతో, ఒక కాలు విరిగి వేలాడుతూ, పరమ భయంకరంగా నా రాజు. దాని గాయాల నుంచి దుర్వాసన.

"దేవీ!" అదే పిలుపు మూడుసార్లు పిలిచాను.

బయటకు వచ్చింది. ఎందుకు రాదూ? పరువు పోతుందని పరుగు పరుగున వచ్చింది.

"ఎందుకొచ్చారు?" ఆయాసపడుతూ అడిగింది.

నవ్వాను పేలవంగా.

ఆ ప్రశ్న పదిసార్లు వేసింది. అదే సమాధానం.

దృశ్యానికి తగినంత మంది ప్రేక్షకులు సిద్ధమయ్యారు. గోడచాటు కొందరు. తలుపు పక్క కొందరు. పబ్లిగ్గా ముగ్గురు నలుగురు. వారిలో మీసాల వృద్ధుడొకడు.

ఆమెకు దగ్గరగా వెళ్ళాను. రొప్పుతోంది. పాము బుసకొట్టినట్టే.

ఆమె ఉత్తరం లోని చివరి వాక్యం: "మరీ ఆ కులమా?" అదురుతున్న ఆమె పెదవులు అదే వాక్యాన్ని పదే పదే అంటున్నట్టనిపించాయి.

ఆమె రెండు చెవుల్నీ నా రెండు చేతుల్తో మూశాను.

ఆమె పెదవుల మీద ముద్దు పెట్టాను.

అవును. ఆమె ఇష్టం ప్రకటించకుండానే, ఆమె అనుమతి లేకుండానే ఆ పని చేశాను. అక్రమమే. అసభ్యమే. ఐ ఔట్రేజ్డ్ హర్ మాడెస్టీ.

ఏం చెయ్యను? నా మృత్యువును ఆమె పెదవుల మీద రాసుకున్నాను.

జీప్ స్టార్ట్ అయింది. ఒక్కణ్ణే పరుగెత్తుకుని వచ్చి జీపు ఎక్కాను.

"ఆమెను లేపుకొస్తానన్నావు కదరా! ఒంటరిగా వచ్చావే?" అడిగాడు స్టీరింగ్ దగ్గర ఉన్న నా మిత్రుడు. వాడికి తెలిసినదంతే. జీపు పోనివ్వమని సైగ చేశాను.

నా పని పూర్తయింది. నాగుపాము తోక తొక్కాను. ఇక కాటు వెయ్యటం దాని పని.

దేవి తండ్రి సుబ్బరాజు ఆ గ్రామానికి మాజీ సర్పంచ్. ఆస్తి పెద్దగా లేదు.





అయినా, రాజు రాజే కదా! ఒక అంటరానివాడి ఎంగిలితో తన కుటుంబం అల్లరి పాలయ్యాక చూస్తూ ఊరుకుంటాడా? నరికి పోగులు పెట్టడూ? నాకు కావలసిందీ అదే.

విజయోత్సాహంతో ఇంటికి చేరుకున్నాను. నేను చనిపోయాక, నా సమాధి నా రాజు సమాధి పక్కనే చెయ్యాలని చీటీమీద వీలునామా రాసి పెట్టాను. పదకొండు గంటలైంది. ఆరు బయట గడ్డపార దిగవేశాను. గడ్డపార నీడ పొట్టిగా ఉంది కానీ పూర్తిగా మాయం కాలేదు.

"మరణించే ముందు చివరి కోరిక ఏమిటి?"

నాకు నేనే తలారిని కాబట్టి నన్ను నేనే ఆ ప్రశ్న వేసుకున్నాను.

పెరుగు బువ్వ లాంటి అమ్మ ముఖాన్ని చూడాలి. వంట గదిలోకి వెళ్ళాను. అమ్మ రొయ్యల వేపుడు చేస్తోంది. మూకుడులో రొయ్యలు ప్రశ్నార్థకాల్లా వేగుతున్నాయి.

అప్పుడు గుర్తొచ్చింది. రాగానే, "అమ్మా! పరీక్ష బాగా రాశానే" అని నేనన్నమాట. నేను శుభవార్త చెప్పినప్పుడల్లా అమ్మ నాకిష్టమైనది వండి పెడుతుంది.

"అమ్మా" అన్నాను. నా స్వరంలో ఏమి తేడా గమనించిందో నా వైపు గిరుక్కున చూసింది. ఎప్పుడో కానీ అమ్మ నా ముఖంవైపు చూడదు. కడుపు వైపే చూస్తుంది.

ఇంత చల్లని తల్లి లోకానికి అంటరానిదెలా అయింది.

కుర్చీ తెచ్చుకుని ఆరుబయట కూర్చున్నాను. అది నా 'భస్మ సింహాసనం!' గడ్డపార కింద తగ్గుతున్న నీడను గమనిస్తున్నాను.

నీడ దాదాపు మాయమయ్యింది. నిటారుగా గడ్డపార! కులం మాయమయితే మనిషి కూడా ఇంతే నిటారుగా కనిపిస్తాడు.

కారు ఆగిన చప్పుడు.

తలయెత్తకుండా వాచీ చూసుకున్నాను. ఇంకా పన్నెండు కావటానికి అయిదు నిమిషాలు ఉంది.

నో! నేను పెట్టుకున్న ముహూర్తానికి ఒక్క నిమిషం కూడా ముందు మరణించటానికి వీలు లేదు.

నా జననం ఎలాగూ నా చేతుల్లో లేదు. లేకుంటే కులంతో పంకిలమైన ఈ గడ్డమీద పుట్టేవాణ్ణే కాదు. నా మరణాన్ని నా చేతుల్లోకి తీసుకోవాలి. నేను నిర్ణయించినవేళకే మరణించాలి. ఈ అయిదు నిమిషాలూ నా ప్రాణం నిలబెట్టుకోవటం కోసం యుద్ధం చేస్తాను.

ఈ తీర్మానంతోనే పిస్తోలు చేతపట్టి తల పైకి ఎత్తాను. సరిగ్గా నా తల్లిలాంటి ముఖంతోనే మరో పెద్దావిడ. ఆమె వెనుక రాజరాజేశ్వరీ దేవి.

"నన్ను చంపటానికి మీరొచ్చారా?" పిస్తోలు జేబులో పెట్టుకున్నాను.

"చావాల్సింది నువ్వు కాదు. మేం. ఇలాంటి పేటలో... ఈ ఇంటిలోకి నా కూతురు కావరానికొస్తే చావాల్సిందెవ్వరో నువ్వే చెప్పు?"

బొంగురుపోయిన ఏడుపు గొంతుతో అడిగింది పెద్దావిడ.

నాకు చిర్రెత్తుకొచ్చింది.

"అయితే, చావలేకపోయావా" అన్నాను గట్టిగా.

"నేను చావగలనయ్యా! దీన్ని చంపుకోలేనుకదా! అక్కడికీ మనసు చంపుకుంది. ప్రాణాన్ని కూడా తీసుకోమని ఎలా చెప్పనయ్యా" అని నా భుజం మీద పడి బావురుమంది.

దేవి పరుగున మా ఇంట్లో దూరింది.

తనను తాను తిట్టుకుని, పట్టుకుని తేరుకున్న దేవి తల్లి ముఖం చూశాను. బాగా కమిలి, వర్ణం మారింది.

రొయ్యలు వేయిస్తున్న నా తల్లి, ఇద్దరి ఆడవాళ్ళ కన్నీళ్ళూ తుడిచింది కానీ, ఒక్క ప్రశ్నా వెయ్యలేదు. కానీ నేను వేశాను.

"నువ్వు చేసిన అల్లరికి మేమక్కడే ఉండిపోతే మా ఆయన నిన్ను చంపుతాడు. ముఖం చూపలేక నా బిడ్డ చస్తుంది. మేమే ఇక్కడికి వచ్చామని తెలిస్తే... మా ఆయనే ఉరేసుకుంటాడు. నా కడుపు తీపి కోసం నా భర్తనే చంపుకొంటున్నానయ్యా!"

ఏడుస్తూ చెప్పిందో, చెబుతూ ఏడ్చిందో మొత్తానికట్లా చెప్పింది దేవి తల్లి.

పన్నెండు గంటలయిపోయింది. నా పుట్టుకే కాదు, నా చావు కూడా నా చేతుల్లో లేదని తేలిపోయింది. ఒక మరణం వాయిదా పడింది.

నా గాయాన్ని నా దేవి చూడనట్టే, నా దేవి గాయాన్ని నేను చూడలేకపోయాను.

నేను కుల పీడితుణ్ణి. ఆమె కులం చేతిలో బందీ.

అయామ్ ద విక్టిమ్. షీ ఈజ్ ద ప్రిజనర్.

కూతురు కోసం కులాన్ని వదిలిన నా దేవి తల్లికి రెండు చేతులూ జోడించాను.

మై డాగ్ ఈజ్ ఆల్వేస్ రైట్.
గాయమే హృదయం. ■

**సరిగ్గా నా తల్లిలాంటి ముఖంతోనే మరో పెద్దావిడ. ఆమె వెనుక రాజరాజేశ్వరీ దేవి. రొయ్యలు వేయిస్తున్న నా తల్లి, ఇద్దరి ఆడవాళ్ళ కన్నీళ్ళూ తుడిచింది**